



ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం

స్మార్ట్ ఎడిషన్
EVENING 6 PM

సంపుటి (Volume): 1 + సంచిక (Issue): 343 + Published From: నంద్యాల (Nandyal) + పేజీలు 2 + https:www.prajarepublic.com + వెల - 1/-
మంగళవారం 15 జూలై 2025

RNI No: APTEL/2023/87888
Andhrapradesh, Telangana, Kurnool, Vijayawada, Vishakapatnam, Tirupati, Ananthapuram, Rajamahedravaram, Guntur, Nellore, Srikakulam, Thadepallegudem, Kadapa, Ongole


# ఖరీఫ్ సాగులో డిజిటల్ సర్వేకు రంగం సిద్ధం

## తప్పులకు చెక్ పెట్టేందుకే సర్వే

పి.నజీర్ అహమ్మద్ కర్నూలు బ్యూరో



**జులై 15, (రిపబ్లిక్ న్యూస్):** ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో రైతులు ఏ పంటలు సాగు చేస్తారో అదే పంటను రికార్డుల్లో చూపేందుకు వినూత్న రీతిలో ఈసారి డిజిటల్ క్రాప్ సర్వేను వ్యవసాయ శాఖ యంత్రాంగం చేపట్టేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. ఈ నెల రెండో వారం నుంచి రైతులు తమ పొలాల్లో కచ్చితంగా ఏ పంటను సాగు చేశారో పూర్తిస్థాయిలో పక్కాగా రికార్డుల్లో నమోదు చేసేందుకు వ్యవసాయ శాఖ సర్వే మొదలెట్టేందుకు వ్యవసాయ శాఖ కమిషనర్ ఢిల్లీ రావు మార్గదర్శకాలు విడుదల చేశారు.

### ప్రభుత్వం మార్గ దర్శకాలు ఇవే..

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రస్తుత ఖరీఫ్‌లో 6.25లక్షల హెక్టార్లలో ప్రధాన పంటలను రైతులు సాగు చేస్తున్నారు. గతంలో ఈక్రాప్, ఈకేవైసీ వంటి పద్ధతుల్లో రైతులు సాగు చేసిన పంటలను నమోదు చేసేవారు. ఈ విధానాల వల్ల చాలా తప్పులు చోటు చేసుకున్నట్లు వ్యవసాయ శాఖ ఉన్నతాధికారులు గుర్తించారు. బ్యాంకుల్లో ఒక పంట సాగు చేస్తున్నట్లు రుణం తీసుకుంటే వ్యవసాయ శాఖ యంత్రాంగం చేపట్టిన సర్వేలో మరో పంట సాగు చేసినట్లు రికార్డుల్లో నమోదు అయ్యేది. దీంతో రైతులు పంటల బీమా పథకంతో పాటు పంట నష్టపరిహారాన్ని పొందేందుకు అర్హతను కోల్పోవాల్సి వచ్చింది. ఇకపై అటువంటి తప్పులు దొర్లకుండా ఈసారి ఖరీఫ్ డిజిటల్ క్రాఫ్ సర్వే వినూత్న రీతిలో చేపట్టేందుకు వ్యవసాయ శాఖ చర్యలు చేపట్టింది. ఎటువంటి తప్పులకు ఆస్కారం లేకుండా పారదర్శకంగా పంట సాగును లెక్కించేందుకు ఉమ్మడి జిల్లా వ్యవసాయ శాఖ యంత్రాంగం సమాయత్తం అవుతుంది.

### బీమా రావాలి అంటే ఈ పంట నమోదు కీలకం

ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టపోయినప్పుడు ప్రభుత్వం నుంచి బీమా పొందాలంటే ఈ-పంటే నమోదే కీలకం. భూయజమానికి బీమా పక్కాగా డిజిటల్ సర్వే ద్వారానే వర్తించేందుకు ఈసారి అధికారులు చర్యలు తీసుకోనున్నారు. అదే సమయంలో పొలం యజమాని తన పొలాన్ని లీజుకు ఇస్తే సీసీఆర్ కార్డులు పొందిన కౌలు రైతులు నష్టపరిహారాన్ని పొందే అవకాశం ఉంటుంది. సాగుకు యోగ్యం కాని వ్యవసాయేతర, ప్రభుత్వ భూములను తొలగించి అనుకూలమైన వాటి వివరాలు నమోదు చేయనున్నారు. ప్రస్తుత వర్గీకరణలతో పాటు ఐదేళ్లుగా పంట వేయని బీడు భూముల వర్గీకరణ అమలులోకి తీసుకువచ్చారు. పొలం గట్ల మీద ఉండే వివిధ రకాల చెట్లు, సాగు చేసిన పంటను కొత్తగా చేపట్టనున్న సర్వేలో చేర్చారు. వ్యవసాయ పంటలు ఎంఏవో, ఉద్యాన పంటలు హెచ్‌వో, సాగుకు యోగ్యం కాని ప్రభుత్వ భూములను ఈసారి తహసీల్దార్ పరిశీలించాల్సి ఉంటుంది. వీరు తిరస్కరించిన భూములకు సంబంధించి సరైన కారణాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి. తిరస్కరణకు గురైన వాటిని రైతు సేవా కేంద్రం సిబ్బంది తిరిగి క్షేత్ర స్థాయిలో పరిశీలిస్తారు. రీసర్వే చేసిన రికార్డులు వ్యవసాయ శాఖ ఏడీఏ, డీహెచ్‌వో ఆమోదించాల్సి ఉంటుంది. అభ్యంతరకర భూముల్లో జాయింట్ కలెక్టర్ అనుమతితో సర్వే చేయాల్సి ఉంటుంది. భూమి యజమానితో పాటు కౌలు రైతుకు చెందిన వివరాలు తప్పనిసరిగా కొత్త విదానంలో డిజిటల్ సర్వేలో నమోదు చేయనున్నారు.



## ఏలూరు జిల్లాలో పర్యటక అభివృద్ధికి చర్యలు:మంత్రి నాదెండ్ల




**ఏలూరు, జూలై 15, (రిపబ్లిక్ న్యూస్):** ఏలూరు జిల్లాలో అద్భుతమైన వనరులు ఉన్నాయని, మౌలిక వసతులు అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందని మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. ఏలూరు కలెక్టరేట్లో అధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పంజాయతీరాజ్, ఆర్అండ్ బీ శాఖల నుంచి నిధులు తీసుకొచ్చి రోడ్లు నిర్మిస్తామని చెప్పారు. పోలవరం, కొల్లేరును పర్యటకంగా అభివృద్ధి చేసేందుకు అవకాశముందన్నారు. జిల్లాల్లో పర్యటక రంగాన్ని అభివృద్ధి చేసేందుకు మరిన్ని కార్యక్రమాలు చేపడతామని తెలిపారు.

## జీనోమ్ వ్యాలీ తెలంగాణకే గుర్తింపును తీసుకొచ్చింది:సీఎం రేవంత్

**హైదరాబాద్, జూలై 15, (రిపబ్లిక్ న్యూస్):** శామీర్‌పేట జీనోమవ్యాలీలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పర్యటించారు. ఐకోర్ బయోలాజిక్స్ పరిశ్రమ ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్ బాబు, వివేక్, ఉన్నతాధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడారు. "జీనోమ్ వ్యాలీలోని పరిశ్రమలు తెలంగాణకే గుర్తింపును తీసుకొచ్చాయి. దేశంలోని వ్యాక్సిన్ల ఉత్పత్తిలో 33 శాతం కేవలం జీనోమ్ వ్యాలీ నుంచే ఉత్పత్తి చేస్తున్నాం. ప్రపంచాన్ని కోవిడ్ భయపెడుతున్న సమయంలో ఇక్కడి నుంచే వ్యాక్సిన్లు తయారు చేశాం. ప్రపంచ దేశాలకు సరఫరా చేయగలిగాం" అని సీఎం అన్నారు. అంతకుముందు మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. జీనోమ్ వ్యాలీ ఆసియా ఖండంలోనే ప్రత్యేకమైందిగా గుర్తింపు పొందిదన్నారు. జీవ శాస్త్రాల అభివృద్ధికి అవసరమైన ఎకో సిస్టమ్ హైదరాబాద్ లో ఉందన్నారు.





## పంచాయితీలో ఘర్షణ.. ఇద్దరు యువకుల దారుణ హత్య

**సుల్తానాబాద్, జూలై 15, (రిపబ్లిక్ న్యూస్):** పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం సుగ్లాంపల్లిలో ఇద్దరు యువకులు దారుణ హత్యకు గురయ్యారు. దంపతుల వ్యవహారంపై పెద్దమనుషుల పంచాయితీలో ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగింది.



వివాదం ముదిరి ఇరువర్గాలు పరస్పరం కత్తులతో దాడులకు దిగాయి. ఘర్షణలో కత్తిపోట్లకు గురైన మల్లేశ్, గణేష్ మృతి చెందగా, మరో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. అమ్మాయి వర్గం సుపారీ ముఠాను తీసుకొచ్చిందని యువకుడి వర్గం ఆరోపిస్తోంది. దాడి అనంతరం నిందితులు అక్కడి నుంచి పరారయ్యారు.

## ఈ రాష్ట్రానికే పెద్ద పిచ్చోడు పేర్ని నాని:మంత్రి కొల్లు రవీంద్ర

**మచిలీపట్నం, జూలై 15, (రిపబ్లిక్ న్యూస్):** వైకాపా నేత పేర్ని నాని బందరుకే కాదు.. ఈ రాష్ట్రానికే పెద్ద పిచ్చోడు అని మంత్రి కొల్లు రవీంద్ర విమర్శించారు. గత కొన్ని రోజులుగా పేర్ని నాని చేస్తున్న వ్యాఖ్యలపై మచిలీపట్నంలో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మండిపడ్డారు.

"ప్రజలు చల్లగా ఉంటే జగన్కు కడుపు మంట. అచ్చోసిన ఆంబోతుల్లా కొందరు వైకాపా నేతలు బరితెగించి మాట్లాడుతున్నారు. ఇసుక అక్రమాలకు పాల్పడ్డానని పేర్నినాని ఆరోపిస్తున్నారు. నేను ఎక్కడా అవినీతికి పాల్పడలేదని ప్రమాణం చేస్తా.. పేర్ని నాని చేస్తారా? గతంలో పౌరసరఫరాల శాఖ మంత్రిగా కొడాలి నాని, రవాణా శాఖ మంత్రిగా పేర్ని నాని.. అమాయకుల పేర్ల మీద కోట్లాది రూపాయల రుణాలు దండుకున్నారు. దీనిపై ప్రమాణం చేయడానికి నేను సిద్ధంగా ఉన్నా. ఎన్నికల్లో గెలిచేందుకు దొంగ పట్టాలు పంపిణీ చేసింది మీరు కాదా?. కులాల మధ్య, కుటుంబాల మధ్య గొడవలు సృష్టించే స్థాయికి పేర్ని నాని దిగజారారు. రప్పా.. రప్పా నరికేయమని చెప్పే వారిని సైకో అంటారా? అలా అనడం తప్పు అని చెప్పే మమ్మల్ని సైకో అంటారా?" అని కొల్లు రవీంద్ర ప్రశ్నించారు.



## మద్యం కేసు.. వైకాపా ఎంపీ మిథున్ రెడ్డికి హైకోర్టులో ఎదురుదెబ్బ

**అమరావతి, జూలై 15, (రిపబ్లిక్ న్యూస్):** మద్యం కేసులో వైకాపా ఎంపీ మిథున్ రెడ్డికి హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. ఆయన దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్ ను ఉన్నత న్యాయస్థానం కొట్టివేసింది. ఈ కేసులో మిథున్రెడ్డి ఏ4 నిందితుడిగా ఉన్నారు. రాష్ట్రంలో మద్యం ఆర్డర్లు, సరఫరా వ్యవస్థ గతంలో ఆన్లైన్ పద్ధతి ద్వారా పారదర్శకంగా ఉండేదని, వైకాపా ప్రభుత్వ హయాంలో దానిని మాన్యువల్ విధానంలోకి తీసుకురావడంలో ఆ పార్టీ ఎంపీ మిథున్ రెడ్డి (ఏ4) కీలక పాత్ర పోషించారని సీఐడీ/సిట్ తరపున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా హైకోర్టులో గురువారం వాదనలు వినిపించారు. తద్వారా లావాదేవీలను తన నియంత్రణలోకి తీసుకున్నారన్నారు. ముడుపులు అందిన కంపెనీలకే మద్యం సరఫరా అనుమతులిచ్చారని తెలిపారు. మద్యం కుంభకోణం ద్వారా ఖజానాకు రూ.3,500 కోట్ల నష్టం జరిగిందన్నారు. ఆ సొమ్మును మళ్లించడంలో మిథున్రెడ్డి పాత్ర కీలకమని చెప్పారు. ఈ కుంభకోణానికి వ్యూహరచన, అమలులో మిథున్రెడ్డి 'మాస్టర్ మైండ్' అంటూ సాక్షులు వాంగ్మూలం ఇచ్చారని, అందుకు ఆధారాలు లభించాయని తెలిపారు. ఎంపీ పదవిని దుర్వినియోగం చేశారని.. దర్యాప్తునకు సహకరించడం లేదని వివరించారు. మిథున్రెడ్డికి నేర చరిత్ర ఉందని, ఆయనపై 8 కేసులు నమోదయ్యాయని చెప్పారు. ముందస్తు బెయిల్ పిటిషన్ను కొట్టేయాలని కోరారు. మిథున్రెడ్డి తరపున సీనియర్ న్యాయవాది టి. నిరంజన్రెడ్డి వాదనలు వినిపించారు. ప్రభుత్వం తీసుకొచ్చిన మద్యం విధానంతో పిటిషనర్కు సంబంధం లేదని వాదించారు. షరతులతో ముందస్తు బెయిలివ్వాలని కోరారు. ఇటీవల వాదనలు ముగించిన హైకోర్టు తీర్పును రిజర్వు చేసింది. ఈ నేపథ్యంలో మిథున్రెడ్డి ముందస్తు బెయిల్ పిటిషన్ ను కొట్టివేస్తూ మంగళవారం తీర్పు వెలువరించింది.



printed and published by B.Nagendra on behaly of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: B.NAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com

# ఆమిరాఖాన్‌తో సినిమాపై లోకేశ్ కనగరాజ్

## ఆసక్తికర వ్యాఖ్యలు.. జానర్ ఇదే



బాలీవుడ్ నటుడు ఆమిరాఖాన్ హీరోగా ఓ సినిమా తెరకెక్కించనున్నట్టు డైరెక్టర్ లోకేశ్ కనగరాజ్ తెలిపారు. ఇండియన్ సినిమా ఆడియన్స్ కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ అభిమానులను అలరించేలా ఆ మూవీ ఉండనుందని చెప్పారు. సూపర్‌హీరో మూవీనా? అని హోస్ట్ అడగ్గా.. అది బిగ్గెస్ట్ యాక్షన్ ఫిల్మ్ అని సమాధానమిచ్చారు. కొన్నాళ్ల క్రితమే ఆ స్టోరీని రాశానని అన్నారు. ఓ యూట్యూబ్ ఛానల్కు ఇచ్చిన ఇంటర్వ్యూలో తన కొత్త సినిమా 'కూలీ', తదుపరి చిత్రాల గురించి మాట్లాడారు. 'కూలీ'లో ఆమిరాఖాన్ కీలక పాత్ర పోషించిన సంగతి తెలిసిందే. 'కూలీ' గురించి చెబుతూ.. "కమర్షియల్ మూవీ అయినప్పటికీ ఇందులో ఎమోషన్ ఎక్కువగా ఉంటుంది. మరోవైపు రజనీకాంత్ సర్ యాక్షన్ను చూపిస్తుంది. ట్రైలర్ విడుదలయ్యే వరకూ ఇందులో నటించిన హీరోల లుక్స్ రివీల్ చేసే ఉద్దేశం లేదు. ఒక్క ట్రైలర్తోనే ప్రమోషన్స్ చాలు అనుకుంటున్నా. దాన్ని ఆగస్టు 2న రిలీజ్ చేస్తాం. నాగార్జున సర్ తన కెరీర్లో ఇప్పటివరకూ నటించని పాత్రను ఇందులో పోషించారు. ఆయన్ను ఒప్పించేందుకు నాకు చాలా సమయం పట్టింది. ఓ పాత్ర కోసం ఫహాద్ ఫాజిల్ను అనుకున్నా. కానీ, ఆయన బిజీగా ఉన్నారు. దీంతో, సౌబిన్ షాహిర్ను ఎంపిక చేశా" అని తెలిపారు. ఈ సినిమాలో ఉపేంద్ర, శ్రుతిహాసన్, సత్యరాజ్ తదితరులు ఇతర కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా ఆగస్టు 14న విడుదల కానుంది.

ఇటీవల వేదికపై లోకేశ్ కనగరాజ్పై సంజయత్ సరదాగా చేసిన కామెంట్స్ వైరలైన విషయం తెలిసిందే. 'లియో'లో చిన్న పాత్ర ఇచ్చి తన సమయం వృథా చేశాడని సంజయ్ అన్నారు. దీనిపై లోకేశ్ స్పందించారు. "ఈ కామెంట్స్ వైరల్ అయ్యాక సంజయ్ నాకు ఫోన్ చేశారు. తాను సరదాగా చేసిన కామెంట్స్ మరో రకంగా వైరల్ అయ్యాయని చెప్పారు. నేను గొప్ప దర్శకుడిని కాదు. ఇంకా నేర్చుకునే దశలోనే ఉన్నాను. భవిష్యత్తులో సంజయత్కు గొప్ప పాత్ర ఇస్తాను. తప్పు సరిదిద్దుకుంటాను" అని లోకేశ్ చెప్పారు. 'కూలీ' విడుదల తర్వాత 'ఖైదీ 2' (కార్తి హీరో) తెరకెక్కించనున్నట్టు తెలిపారు. అది పూర్తయ్యాక ఆమిర్తో సినిమా రూపొందించే అవకాశం ఉందన్నారు. సూర్యతో రోలెక్స్ మూవీ చేస్తానన్నారు. 'విక్రమ్ 2' (కమల్ హాసన్తో), 'మాస్టర్ 2' (విజయ్) 'లియో 2' (విజయ్ ) చేయాలనుందని, ఆయా హీరోల డేట్స్ ఎప్పుడు లభిస్తే అప్పుడు చేస్తానని పేర్కొన్నారు.

## అందుకే రూమర్స్‌ను పట్టించుకోకూడదు:నిధి అగర్వాల్



అగ్ర కథానాయకులతో కలిసి సందడి చేయడానికి సిద్ధమయ్యారు నటి నిధి అగర్వాల్. పవన్‌తో 'హరిహర వీరమల్లు', ప్రభాస్తో 'ది రాజాసాబ్' ఈ ఏడాది ప్రేక్షకులకు వినోదాన్ని అందించనున్నారు. హరిహర వీరమల్లు జులై 24న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సినిమా ప్రచారంలో భాగంగా నిధి ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. తెలుగు ప్రేక్షకులంటే తనకెంతో ఇష్టమని తెలిపారు. తెలుగు సినిమాల్లో నటించే అవకాశం రావడం ఎంతో సంతోషాన్నిచ్చిందన్నారు. "హరిహర వీరమల్లు సినిమా ఓ విజువల్ వండర్లా ఉంటుంది. ఏఎం రత్నం ఎక్కడా రాజీ పడకుండా దీన్ని నిర్మించారు. ఆయన ఈ సినిమా విజయంపై ఎంతో ధీమాగా ఉన్నారు. నేను ట్రైలర్ ఎన్నిసార్లు చూశానో లెక్కేలేదు. ఈ సినిమా ప్రారంభంలో ఎన్నో రూమర్స్ వచ్చాయి. ట్రైలర్ రిలీజ్ అయ్యాక వాటన్నిటికీ చెక్ పడింది. మనం ఓ పనిచేస్తున్నప్పుడు ఎన్నో కామెంట్స్ వినిపిస్తాయి. వాటిని పట్టించుకోకుండా మన పని మనం చేయాలి. మొదట బాలేదు అన్న ప్రేక్షకులే వెంటనే చాలా బాగుంది అని అంటారు. చాలా బాగా నటించారు అని కామెంట్ చేస్తారు. అందుకే రూమర్స్ను పట్టించుకోకుండా మన పని శ్రద్ధగా చేస్తూ ఉండాలి."హరిహర వీరమల్లు కోసం పవన్ ఎంతో కష్టపడ్డారు. దీనికోసం వర్క్‌షాప్లు చేశారు. సినిమాలో ప్రతి విభాగంలోనూ ఆయన భాగమయ్యారు. డైలాగ్స్, పాటలు, యాక్షన్ సన్నివేశాలు అన్నిటికీ సలహాలిచ్చారు. ఎన్నికల ముందు దీన్ని ప్రారంభించారు. డిప్యూటీ సీఎం అయ్యాక దీన్నే మొదట పూర్తి చేశారు. 5 ఏళ్ల కాలంలో ఆయనలో ఎలాంటి మార్పు రాలేదు. విజయవాడలో షూటింగ్ చేసినన్ని రోజులు విరామ సమయంలో ఒకవైపు మీటింగ్‌లో పాల్గొంటూనే చిత్రీకరణకు వచ్చేవారు. 'హరిహర వీరమల్లు' పార్ట్-2 కూడా 20 నిమిషాల షూటింగ్ పూర్తి చేశాం. మొదటి పార్ట్ విడుదలైన తర్వాత దాన్ని తిరిగి ప్రారంభిస్తాం" అని నిధి అగర్వాల్ తెలిపారు.

రిపబ్లిక్ సినిమా CINEMA

## 'ది ఫ్యామిలీ మ్యాన్' సిరీస్ ఇంత విజయం సాధిస్తుందనుకోలేదు :మనోజ్ బాజ్‌పాయ్



ప్రేక్షకులను విశేషంగా అలరించిన వెబ్‌సిరీస్లలో 'ది ఫ్యామిలీ మ్యాన్' కూడా ఒకటి. ఇప్పటివరకూ రెండు సీజన్లు పూర్తి చేసుకున్న ఈ స్పై యాక్షన్ థ్రిల్లర్ సిరీస్ ముచ్చటగా మూడోసారి అలరించడానికి సిద్ధమైంది ఇందులో కీలకపాత్రలో నటించిన మనోజ్ బాజ్‌పాయ్ తాజాగా ఈ సిరీస్ గురించి ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. "ది ఫ్యామిలీ మ్యాన్ 3' అక్టోబర్ చివర్లో లేదంటే నవంబర్ ప్రారంభంలో స్ట్రీమింగ్ కానుంది. ఈ ప్రాజెక్ట్ను మొదలు పెట్టినప్పుడు ఇంతటి ప్రేక్షకాదరణను సొంతం చేసుకుంటుందని అనుకోలేదు. మూడో సీజన్ షూటింగ్ కూడా పూర్తయింది. నా కెరీర్లో ఎన్నో హిట్ సిరీస్లలో నటించినప్పటికీ 'ది ఫ్యామిలీ మ్యాన్' మాత్రం వాటన్నిటికంటే ముందు వరుసలో ఉంటుంది. దీని రెండో సీజన్లో సమంత అద్భుతమైన పాత్ర పోషించారు. ఈ బాధ్యతను మూడో సీజన్లో జైదీప్ అహ్లావత్ తీసుకున్నారు. ఆయన ఎంత గొప్ప నటుడో ఇది విడుదలయ్యాక అందరికీ అర్థమవుతుంది. ఇందులో ఆయనే కీలకం. అంకితభావం కలిగిన ఇలాంటి గొప్ప నటులతో కలిసి వర్క్ చేసినందుకు గర్వంగా ఉంది" అని తెలిపారు. ఇటీవల ఈ సీజన్లో పాత్రలను పరిచయం చేస్తూ ఓ వీడియో విడుదల చేయగా అది అందరినీ ఆకట్టుకుంది. కాంత్ తివారీ (మనోజ్ బాజ్పాయ్) పాత్రతో పాటు, జేకే తల్పాడే (షరీబ్ హష్మి), సుచిత్ర తివారీ (ప్రియమణి), ధృతి తివారీ (ఆశ్లేష ఠాకూర్), అరవింద్ (శరద్ ఖేల్కర్) మేజర్ విక్రమ్ (సందీప్ కిషన్) తదితర పాత్రలు మరోసారి అలరించనున్నాయి. అమెజాన్ ప్రైమ్ వీడియో వేదికగా అందుబాటులోకి రానుంది.

ప్రజా రిపబ్లిక్ దిన పత్రిక
9948814188,
9985876888
ప్రకటన
ప్రజా సమస్యల పై అనునిత్యం ప్రజా గళాన్ని అక్షర సత్యాలతో కూడిన సంచలన వరుస కథనాలను అందిస్తూ దూసుకెళ్తున్న ప్రజా రిపబ్లిక్ దినపత్రికకు రెండు తెలుగు రాష్ట్రాలలో తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ జిల్లాలలో, నియోజకవర్గాలలో స్టాఫ్ రిపోర్టర్లు, పాత్రికేయులు, మండలాల నందు పాత్రికేయులు కావలెను. ప్రజల పక్షాన నిలుస్తూ సమస్యల పరిష్కారానికి అక్షర పోరాటం చేయడానికి మాతో కలిసి పని చేసేందుకు ఆసక్తి గల అభ్యర్థులు కర్నూలు మరియు నంద్యాలలోని మా కార్యాలయముల నందు లేదా ఫోన్ నెంబర్లకు సంప్రదించగలరు.
ప్రజా రిపబ్లిక్ దినపత్రిక కార్యాలయం, షాప్ నెం: 26, మొదటి అంతస్తు, శ్రీనివాస కాంప్లెక్స్, శ్రీనిధి టిఫిన్ సెంటర్ ఎదురుగా, నంద్యాల - 518501
డోర్ నెం:46/181/బి-1, మనోజ్ టాలెంట్ స్కూల్ దగ్గర, బుధవార పేట, కర్నూలు - 518001
బొజ్జ నాగేంద్ర
ఎడిటర్ & మేనేజింగ్ డైరెక్టర్

## చరిత్రలో నేటి ప్రత్యేకత

- 1820 : బెంగాల్ సాంస్కృతిక పునరుజ్జీవనమునకు ఆద్యులలో ఒకడైన అక్షయ్ కుమార్ దత్తా జననం (మ.1886).
- 1885 : భారత స్వాతంత్ర్య సమరయోధుడు పి.ఏ.థాను పిళ్లై జననం (మ.1970).
- 1901 : భారత స్వాతంత్ర్య సమరయోధుడు చెలికాని రామారావు జననం (మ.1985).
- 1902 : ఆంధ్రప్రదేశ్ హైకోర్టు మొట్టమొదటి ప్రధాన న్యాయమూర్తి, తొమ్మిదవ సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి కోకా సుబ్బారావు జననం (మ.1976).
- 1903 : భారత రత్న పురస్కార గ్రహీత కె.కామరాజ్ జననం (మ.1975).
- 1909 : భారత స్వాతంత్ర్య సమరయోధురాలు, సంఘ సంస్కర్త, రచయిత్రి దుర్గాబాయి దేశ్‌ముఖ్ జననం (మ.1981).(చిత్రంలో)
- 1920 : సినీ కథా రచయిత డి.వి.నరసరాజు జననం (మ.2006).
- 2013 : భారత దేశంలో టెలిగ్రాఫ్ వ్యవస్థ మూయబడినది.
- 2015 : మొదటిసారిగా ప్రపంచ యువజన నైపుణ్యాల దినోత్సవం జరుపుకున్నాము.


అక్షయ్ కుమార్ దత్తా


పి.ఏ.థాను పిళ్లై



చెలికాని రామారావు


కోకా సుబ్బారావు


కె.కామరాజ్


దుర్గాబాయి దేశ్‌ముఖ్


డి.వి.నరసరాజు



యువజన నైపుణ్యాల దినోత్సవం

రిపబ్లిక్ స్పోర్ట్స్

## రిషభ్ పంత్, ఎంఎస్ ధోనీ సరసన చేరిన రవీంద్ర జడేజా!




లార్డ్స్ వేదికగా ఇంగ్లాండ్ తో జరిగిన మ్యాచ్లో ఆల్రౌండర్ రవీంద్ర జడేజా ఒంటరిపోరాటం చేశాడు. ఈక్రమంలో అతడు అంతర్జాతీయ క్రికెట్లో 7,000 పరుగులను పూర్తి చేసుకున్నాడు. అలాగే రికార్డ్స్ బుక్స్‌లో.. రిషబ్ పంత్, సౌరభ్ గంగూలీ, ఎంఎస్ ధోనీ, మన్సూర్ అలీఖాన్ పటౌడీ సరసన చేరాడు. క్రికెట్ పుట్టినిల్లుగా పేరున్న లార్డ్స్ ఇంగ్లాండ్ తో జరిగిన మూడో టెస్ట్ మ్యాచ్లో.. రెండు ఇన్నింగ్స్ ల్లోనూ హాఫ్ సెంచరీలు సాధించి సత్తా చాటాడు. అయినా ఆ మ్యాచ్లో టీమ్ ఇండియా 22 పరుగులతేడాతో పరాజయం పాలైంది. రవీంద్ర జడేజా 361 అంతర్జాతీయ మ్యాచులు, 302 ఇన్నింగ్స్ 7,018 పరుగులు చేశాడు. ఇందులో 39 అర్ధశతకాలున్నాయి. 83 టెస్టుల్లో అతడు 3,697 పరుగులు చేశాడు. అందులో 4 సెంచరీలు, 26 హాఫ్ సెంచరీలున్నాయి. 175 వ్యక్తిగత అత్యధిక స్కోర్. ప్రస్తుతం ఇంగ్లాండ్ తో టీం ఇండియా ఆడిన మూడు టెస్ట్ మ్యాచుల్లో జడేజా 109 యావరేజ్తో 327 పరుగులు చేశాడు. అత్యధికంగా ఒక ఇన్నింగ్స్ లో 89 పరుగులు సాధించాడు. ఈ సిరీస్లో ఇప్పటివరకు ఎక్కువ పరుగులు చేసిన బ్యాటర్ల జాబితాలో అయిదో స్థానంలో ఉన్నాడు.ఇంగ్లాండ్ లో నాలుగు, అంతకంటే ఎక్కువ హాఫ్ సెంచరీలు సాధించిన మూడో భారత బ్యాటర్గా నిలిచాడు. పంత్ ఇప్పటివరకు అయిదు, గంగూలీ నాలుగు హాఫ్ సెంచరీలు సాధించారు. లార్డ్స్ రెండు ఇన్నింగ్స్ ల్లోనూ హాఫ్ సెంచరీలు (72, 61లి) సాధించిన భారత బ్యాటర్గా జడేజా రికార్డ్ సృష్టించాడు. ఇంతకుముందు ఈ రికార్డును వినోద్ మన్కడ్ (1952లో 72, 184) సాధించాడు. అలాగే దేశాల్లో జరిగిన టెస్ట్ మ్యాచుల్లో రెండు ఇన్నింగ్స్ ల్లోనూ నెంబర్ 6 లేదా అంతకంటే దిగువ స్థానాల్లో బ్యాటింగ్ చేసి.. హాఫ్ సెంచరీలు సాధించిన పటౌడీ (64, 148 ఇంగ్లాండ్, లీడ్స్-1967, 75, 85 ఆస్ట్రేలియా, మెల్బోర్న్- 1967), ఎంఎస్ ధోనీ (52, 56లి న్యూజిలాండ్, వెల్లింగ్టన్- 2009, 77, 74లి ఇంగ్లాండ్, బర్మింగ్ హామ్ -2011) సరసన నిలిచాడు.అలాగే ఆరు, అంతకంటే దిగువ స్థానాల్లో బ్యాటింగ్ చేసి 29 హాఫ్ సెంచరీలు చేసిన జడేజా.. వీవీఎస్ లక్ష్మణ్ (28 హాఫ్ సెంచరీలు)ను అధిగమించాడు. జడేజా కంటే ముందు కపిల్దేవ్ (35), ఎంఎస్ ధోనీ (38) ఉన్నారు.

## ఇంటి చిట్కాలు


## బంగారు నగలు ఎప్పటికీ కొత్తవాటిలానే ఉండాలంటే ఎలా క్లీన్ చేసి, స్టోర్ చేయాలంటే

బంగారం కొత్తగా మెరవాలని అందరికీ ఉంటుంది. అయితే, కొన్నప్పుడు కొత్తలో ఉన్నంత మెరుపు రాన్రాను ఉండదు. అలా కాకుండా ఎప్పటికీ బంగారు నగలు కొత్తగానే ఉండాలంటే ఎలా క్లీన్ చేయాలి, ఎలా స్టోర్ చేయాలో తెలుసుకోండి.

బంగారు నగలు వేసుకోవడం చాలా మందికి ఇష్టం. అయితే, వీటిని కొన్నప్పుడు ఎంత కొత్తగా మెరుస్తూ ఉన్నాయో అలానే ఉంచడం కాస్తా కష్టమే. వాడినప్పుడల్లా వాటి మెరుపు కాస్తా తగ్గుతుంది. జ్యువెలరీని వాడితేనే కాదు వాటిని స్టోర్ చేసి పెట్టినప్పటికీ ముందులా కొత్తగా ఉండవు. దీనికి చాలానే కారణాలు ఉంటాయి. అలా కాకుండా బంగారు నగలు ఎప్పటికీ కొత్తగా ఉండాలంటే కొన్ని టిప్స్ ఫాలో అవ్వాలి. ఇంట్లో దొరికే కొన్ని పదార్థాలతోనే వీటిని క్లీన్ చేసి స్టోర్ చేస్తే అవి తిరిగి కొత్తగా మారతాయి. మరి ఆ కిటుకులేంటో మీరూ తెలుసుకోండి.



### నీటిలో నానబెట్టడం



నగల్ని నేరుగా క్లీన్ చేయడం కంటే ఓ సారి నీటిలో నానబెట్టి క్లీన్ చేయండి. దీనికోసం గోరువెచ్చని నీరు వాడండి. అలా అని మరీ వేడి నీరు వాడొద్దు. కేవలం గోరువెచ్చని నీటిలో నానబెట్టండి. దీంతో అందులో ఇరుక్కున్న జిడ్డు కరిగి నగలు తెల్లగా వస్తాయి. కాస్తా సమయం నీటిలో నానబెట్టాక ఆ తర్వాత వాటిని క్లీన్ చేయాలి.

### నెమ్మదిగా రుద్దడం



చాలా మంది బంగారు నగల్ని టూత్‌పేస్ట్, టూత్ పౌడర్, సర్ఫ్, సబ్బు, లిక్విడ్ ఇలా రకరకాలవి వేసి క్లీన్ చేస్తారు. అయితే, అలా కాకుండా కాస్తా మైల్డ్ సోప్ సొల్యూషన్ అంటే ఎక్కువగా కెమికల్స్ లేని సోప్‌ని వేసి క్లీన్ చేయండి. అది కూడా మెత్తని టూత్ బ్రష్‌తో రుద్దండి. అంతేకానీ, బరబరా రుద్దొద్దు. దీంతో మెరుపు తగ్గడమే కాదు, గీతలు పడే అవకాశం ఉంది. కాబట్టి, నెమ్మదిగా మైల్డ్ సోప్‌తో నగల్ని క్లీన్ చేయండి.

### క్లీన్ చేయడం



బ్రష్‌తో రుద్దాక ఒక్కో నగ తీసుకుని నల్లకింద పెట్టి వాటర్ ఆన్ చేయండి. అయితే జాగ్రత్త ఎక్కువ ఫోర్స్‌తో ఆన్ చేయకూడదని గుర్తుంచుకోండి. అదే విధంగా, ఒక్కొక్కటి మాత్రమే జాగ్రత్తగా తీసి వాటర్ కింద ఉంచండి. అంతేకానీ, మనం ఎక్కువగా నీటి కిందపెడితే నగలు జారి కిందపడే అవకాశం ఉంది.

### ఆరనివ్వడం




అదే విధంగా, ఇలా క్లీన్ చేసిన నగల్ని జాగ్రత్తగా ఆరనివ్వండి. ఇందుకోసం మంచి సాఫ్ట్ అండ్ క్లీన్ క్లాత్ తీసుకుని అద్దాలి. గాలికి ఆరనివ్వండి. పూర్తిగా ఆరిన తర్వాతే స్టోర్ చేయండి. అంతేకానీ, తడిగా ఉన్నప్పుడు పెడితే నగల రంగు మారే అవకాశం ఉంది. కచ్చితంగా పూర్తిగా ఆరిన తర్వాతే భద్రంగా స్టోర్ చేయండి.

### స్టోర్ చేయడం



వీటిని చక్కగా క్లీన్ చేశాక సెపరేట్‌గా ప్యాక్ చేసి స్టోర్ చేయాలి. ఒక్కొక్కటి విడివిడిగా ఉంచితే గీతలు పడవని గుర్తుంచుకోండి. అంతేకానీ, అన్నీ కలిపి స్టోర్ చేయొద్దు.
అదే విధంగా, గాలి చొరని బాక్స్‌లు వీలైతే ఆ గోల్డ్ కోసం వచ్చిన బాక్సుల్లోనే వాటిని ఉంచాలి.
అప్పుడే గోల్డ్ నగలు ఎప్పటికీ అప్పుడే కొన్నవాటిలా ఉంటాయి.
గోల్డ్, సిల్వర్ నగల్ని కూడా కలిపి ఉంచొద్దని గుర్తుపెట్టుకోండి.
క్లీన్ చేయడం, స్టోర్ చేయడం రెండూ కూడా సెపరేట్‌గానే ఉండాలి.

### వీటిని అసలే వాడొద్దు



అయితే, కొంతమంది ఎక్కువ మెరుపు రావాలని బ్లీచ్, అమోనియా, ఇతర హార్ష్ కెమికల్స్ వాడతారు. దీని వల్ల మెరుపు వచ్చినప్పటికీ అది శాశ్వతం కాదు. తర్వాత వాటి కళ తగ్గుతుంది. అదే విధంగా, వీటిని క్లీన్ చేసేందుకు స్క్రబ్బర్స్, వూల్ ప్యాడ్స్ వంటివి వాడొద్దు. అవి నగలకి చుట్టుకునే అవకాశం ఉమంది.